నాణ్యమైన విద్య, భోజనం అందించాలి

పెద్దపల్లి కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్

పెద్దపల్లి, ఫిబ్రవరి12: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం అనంతరం కలెక్టరేట్‌లో మధ్యాహ్న భోజనం, పదో తరగతిలో మెరుగైన ఫలితాల సాధించటానికి తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా అధికారులతో సమీక్షించారు. పదో తరగతి పరీక్షలో మెరుగైన ఫలితాల సాధన దిశగా జిల్లాలో పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని, ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని, పౌష్టికాహారంతో కూడిన స్నాక్స్ అందిస్తున్నామని తెలిపారు. ప్రతి బుధవారం జిల్లా అధికారులు పాఠశాలను సందర్శించే సమయంలో అన్ని విషయాలను కుణ్ణంగా పరిశీలించి నివేదిక సమర్పించాలన్నారు. ఇతర పని దినాల్లోనూ జిల్లా అధికారులు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించవచ్చని స్పష్టం చేశారు. ప్రతి జిల్లా అధికారికి కొంత మంది పదో తరగతి విద్యార్థులను కేటాయించనున్నట్లు తెలిపారు. లంచ్ అండ్ లెర్న్ కార్యక్రమం ద్వారా పాఠశాలలో మధ్యాహ్న భోజన నాణ్యత పెరుగుతుందని తెలిపారు. కలెక్టరేట్‌లో పనిచేసే జిల్లా అధికారులు, ప్రభుత్వ సిబ్బంది హెల్త్ ప్రొఫైల్ రూపకల్పనకు చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వోకు సూచించారు.

ప్రజావాణిలో అర్జీదారుతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజామ్మిల్

ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి..

ప్రజావాణి ఫిర్యాదులను ఎప్పకప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జేఅరుణశ్రీతో కలిసి కలెక్టర్ అర్జీలు స్వీకరించారు.

టాస్క్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు

యువతలో నైపుణ్యం పెంపొందించేందుకు టాస్క్ సెంటర్ ఏర్పాటు దిశగా ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. టాస్క్ సెంటర్ ఏర్పాటు కోసం అనువైన ప్రభుత్వ భవనాలను టాస్క్ సీఈవో శ్రీకాంత్ సిన్హా తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. టాస్క్ సెంటర్ పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేస్తామని మంత్రి శ్రీధర్ బాబు ప్రకటించారని తెలిపారు. మంత్రి ఆదేశాల మేరకు టాస్క్ సెంటర్ ఏర్పాటు కోసం ఐటీఐలోని పాత కలెక్టరేట్, ఎంపీడీవో ప్రాంగణంలో పాత ప్రభుత్వ కార్యాలయాలు, పెద్దపల్లి డివిజనల్ పంచాయతీ అధికారి కార్యాలయాన్ని పరిశీలించామని తెలిపారు. కార్యక్రమంలో టాస్క్ మేనేజర్ ప్రదీప్ రెడ్డి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా మేనేజర్ గంగాప్రసాద్, పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ ఆకుల వేంకటేశ్, అధికారులు పాల్గొన్నారు.

నైపుణ్యాలను పెంచుకోవాలి

మార్కెట్ పరిస్థితు లు, డిమాండ్‌కు అనుగుణంగా ఎప్పటికప్పుడు నైపుణ్యాలను అప్‌డేట్ చేసుకోవాలని కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ విద్యార్థులకు సూచించారు. పెద్దపల్లిలోని ప్రభుత్వ ఐటీఐని సోమవారం తనిఖీ చేశారు. కాసేపు విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం ఐటీఐ ఆవరణలో ఏర్పాటు చేస్తున్న మేడారం జాతర ప్రత్యేక బస్ షెల్టర్ పాయింట్‌ను కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ వెంట కమిషనర్ వెంకటేశ్, ఐటీఐ ప్రిన్సిపాల్, ఆర్టీసీ సంబంధిత అధికారులున్నారు.

విద్యార్థినులను అభినందించిన కలెక్టర్

రాష్ట్ర స్థాయి సోషల్ స్టడీస్ టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ చూపిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులను కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ అభినందించారు. ఈనెల 10న రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌లో విద్యాశాఖ, తెలంగాణ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి సోషల్ స్టడీస్ టాలెంట్ టెస్ట్‌లో అంతర్గాం కేజీబీవీ పాఠశాల విద్యార్థిని ఏ వైష్ణవి, జూలపల్లి జడ్పీ హెచ్ఎస్ బాలికల పాఠశాల విద్యార్థిని ఉప్పుల చారుభాషిని తృతీయ స్థానంలో నిలిచారు. వారిని కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో అభినందించారు. మెడల్స్ ప్రశంస పత్రాలు అందజేశారు. ఇక్కడ జీసీడీవో కవిత, సోషల్ స్టడీస్ ఫోరం ప్రెసిడెంట్ మార రమేష్, సభ్యుడు జే సత్యనారాయణ, ఉపాధ్యాయులు కే శ్రీనివాస్ రెడ్డి, సరోజ శర్మ ఉన్నారు.

గౌరెడ్డిపేట ఎంఎస్ఆర్ ఇటుకబట్టీల్లో విచారణ చేస్తున్న సీఐ కృష్ణ, బసంత్‌గర్ ఎస్ఐ వెంకటేశ్

ఇటుకబట్టీలకు కదిలిన అధికారుల బృందం

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 12 : గౌరెడ్డిపేట శివారులో గల ఎంఎస్ఆర్ ఇటుకబట్టీలో జరిగిన ఫుడ్‌పాయిజన్ ఘటనలో 35 మంది వరకు అస్వస్థతకు గురికాగా, అందులో ఇద్దరు మరణించిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన అధికారులు ఇటుకబట్టీల్లో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. బాధితులు ఎంఎస్ఆర్ ఇటుకబట్టీకి చెందిన కార్మికులుగా తేలడంతో యజమాని నుంచి వివరాలు సేకరించారు. పెద్దపల్లి, కరీంనగర్ దవాఖాన్లలో ఉన్న వారి వివరాలు సేకరించి 33 మందికి ఫుడ్ పాయిజన్ అయిందని గుర్తించారు. ఇప్పటి వరకు కేవలం ఫుడ్ పాయిజన్ వల్ల కార్మికులు అస్వస్థతకు గురయ్యారని చెబుతున్నా, వారంతా ఏం తినడం వల్ల అలా జరిగిందనే విషయాన్ని మాత్రం అధికారులు స్పష్టం చేయలేపోతున్నారు. అస్వస్థతకుగురైన వారిలో ఓ గర్భిణి కూడా ఉండడంతో ఆమెను హైదరాబాద్‌లోని దవాఖానకు తరలించి చికిత్స చేయిస్తున్నారు.

అన్ని తామైన పెద్దపల్లి పోలీసులు...

పెద్దపల్లి జోన్ డీసీపి చేతన, ఏసీపీ ఎడ్ల మహేశ్ ఆదేశాల మేరకు సీఐ కృష్ణ పర్యవేక్షణలో బసంతనగర్ ఎస్ఐ సులువ వెంకటేశ్ తమ సిబ్బందిని అప్రమత్తం చేశారు.కార్మికుల యోగ క్షేమాల విషయంలో అన్ని తామై యజమానులను పురమాయిస్తున్నారు.

అధికారుల విచారణ

వీబీఐ ఇటుకబట్టీ నిర్వాహకులు తనను లైంగిక వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తూ ఓ మహిళ పెద్దపల్లి జోన్ డీసీపీకి ఎక్స్(ట్విట్టర్) ద్వారా ఫిర్యాదు చేసింది. డీసీపీ ఆదేశాల మేరకు సీడీవో కవిత, డీఎల్‌పీవో రాంబాబు, డాక్టర్లు మమత, సింధూజ, ఎంపీవో సుదర్శన్, కార్యదర్శి శ్రీధర్ సోమవారం విచారణ చేపట్టారు. భర్తతోపాటు తన సంబంధీకులంతా ఇక్కడ లేకుండా వెళ్లి పోయారని తాను కూడా స్వగ్రామానికి వెళ్లి పోతానని అందుకోసమే అలా చేశానని అధికారుల ముందే ఒప్పుకుంది. దీంతో ఆమెకు టికెట్ తీసి రైలు మార్గం పంపించినట్లు అధికారులు తెలిపారు.

ఇద్దరు ఏసీపీల బదిలీ

ఫర్టిలైజర్ సిటీ, ఫిబ్రవరి 12: రామగుండం కమిషనరేట్‌లో పనిచేస్తున్న ఇద్దరు ఏసీపీలను బదిలీ చేస్తూ డీజీపీ రవిగుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. పెద్దపల్లి ఏసీపీ ఎడ్ల మహేశ్‌ను నారాయణపేట డీసీఆర్బీ డీఎస్పీగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో సీఐడీ విభాగంలో డీఎస్పీగా చేస్తున్న సీహెచ్. శ్రీనివాస్‌ను నియమించారు. బెల్లంపల్లి ఏసీపీ పీ. సదయ్యను డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. ఆయన స్థానంలో రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్‌బీ డీఎస్పీ ఏ. రవికుమార్‌ను నియమించారు.

సమ్మక్క జాతర కమిటీ

ఎలిగేడు, ఫిబ్రవరి 12: ఎలిగేడు శివారులోని పెండ్లిపోరుగుట్ట వద్ద జరిగే సమ్మక్క-సారలమ్మ జాతర కమిటీని లాలపల్లి , ఎలిగేడు గ్రామస్తులు సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సింగిరెడ్డి రాజేశ్వరరెడ్డి, ఉపాధ్యక్షుడిగా కవ్వంపెల్లి స్వామి, ప్రధాన కార్యదర్శి అమ్ముల కుమారస్వామి, కోశాధికారి బూర్ల వెంకటసత్యం ఎన్నికయ్యారు. అనంతరం జాతరలో దుకాణాల నిర్వహణకు వేలం పాట నిర్వహించారు. కూల్‌డ్రింక్‌ల దుకాణానికి రూ.2,100 లు, కొబ్బరి కాయలకు రూ. 6,100 లు, మద్యం విక్రయానికి రూ. 10, 500లు, కోళ్లకు రూ. 5వేల చొప్పున వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు.

రేపు రక్తదాన శిబిరం

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి12: వసంతపంచమి సందర్భంగా ఈనెల 14న కాల్వశ్రీరాంపూర్ హైస్కూల్ లో 1992-93 టెన్త్ బ్యాచ్ విద్యార్థుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు పూర్వ విద్యార్థి కొల్లూరి హరిప్రసాద్ సోమవారం తెలిపారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు నిర్వహించే ఈ క్యాంపులో పూర్వ విద్యార్థులు హాజరై రక్తదానం చేయాలని కోరారు. అనంతరం హైస్కూల్ ఆవరణలో ఉన్న సరస్వతీ మాతకు పూజా కార్యక్రమం ఉంటుందన్నారు.

ఆర్జీ-1 జీఎం తనిఖీ

గోదావరిఖని, ఫిబ్రవరి 12: సింగరేణి ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్ జీఎం కార్యాలయంలోని అన్ని డిపార్ట్‌మెంట్లను సోమవారం తనిఖీ చేశారు. అందులో పని చేస్తున్న ఉద్యోగులతో స్వయంగా మాట్లాడారు. డిపార్ట్‌మెంట్‌లో పనులను అడిగి తెలుసుకున్నారు. విధులు సక్రమంగా నిర్వహించాలని, సమయ పాలన తప్పనిసరిగా పాటించాలని సూచించారు. డిపార్ట్‌మెంట్‌లో పనులను పెండింగ్‌లో లేకుండా వేగంగా నిర్వహించాలని, సరైన సమయంలో వారికి కేటాయించిన పనులను పూర్తి చేయాలన్నారు. జీఎంతో పాటు అధికారులు లక్ష్మీనారాయణ, ఆంజనేయులు, ఆంజనేయ ప్రసాద్, సారంగపాణి తదితరులున్నారు.

వైద్య శిబిరాలు

ధర్మారం,ఫిబ్రవరి12: కళ్లెంరెడ్డిపల్లి, న్యూ కొత్తపల్లి, నాయకంపల్లి, కటికనపల్లి, నందిమేడారం, చింతలపల్లిలో వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరాలను నిర్వహించారు. రక్తనమునాలు సేకరించారు. మందులు పంపిణీ చేశారు.ఎర్రగుంటపల్లిలో ఇటుక బట్టీల వద్ద హెల్త్ క్యాంప్ నిర్వహించారు. మిషన్ భగీరథ, వైద్య సిబ్బంది కలిసి ధర్మారంలోని ట్యాంక్‌లో నీటిని క్లోరినేషన్ టెస్ట్ చేశారు.

సుల్తానాబాద్, ఫిబ్రవరి 12 : లయన్స్ క్లబ్ ఆఫ్ సుల్తానాబాద్ ఆధ్వర్యంలో రేకుర్తి కంటి దవాఖాన సౌజన్యంతో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ ప్రభాకర్ 150 మందికి కంటి పరీక్షలు చేశారు. 18 మందికి ఆపరేషన్ అవసరాన్ని గుర్తించారు. క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, జిల్లా అదనపు కార్యదర్శి వల్స నీలయ్య, జిల్లా కో-ఆర్డినేటర్ శ్రీనివాస్, వెంకటేశం,డాక్టర్ ప్రభాకర్, ప్రిన్సిపాల్ కమలాకర్, పరుశరాములు ఉన్నారు.

16న రథసప్తమి వేడుకలు

జ్యోతినగర్, ఫిబ్రవరి 12: రామునిగుండాల కొండపై స్వయంభువుగా వెలసిన శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 16న రథసప్తమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యుడు తిరుపతి తెలిపారు. రథసప్తమి రోజున తిరుమలలో స్వామివారు సప్త వాహనాలు అధిరోహించే వేడుకల తరహాలో రామునిగుండాల కొండపై వేడుకలు చేపడుతున్నామని తెలిపారు.

నేత్రదాత సంస్మరణ సభ

కమాన్‌పూర్, ఫిబ్రవరి 12: కమాన్‌పూర్‌కు చెందిన కోటగిరి రాజయ్య (59) గత నెల 31న చనిపోగా కుటుంబ సభ్యులు ఆయన నేత్రాలను దానం చేశారు. సోమవారి రాజయ్య ఇంటి వద్ద సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్రదాత సంస్మరణ సభ నిర్వహించారు. ఫౌండేషన్ కార్యదర్శి లింగమూర్తి, అధ్యక్షురాలు అన్నపూర్ణ, లయన్స్ క్లబ్ సభ్యులు వెంకటస్వామి, మాజీ ఎంపీపీ ఇనగంటి రామారావు, లింగమూర్తి, మండల అధ్యక్షుడు నరసింహాచారి, సాన రామకృష్ణారెడ్డి, నల్లవెల్లి శంకర్, శ్రవణ్‌కుమార్, నూక రమేశ్, రాజమౌళి న్నారు.

మాజీ మంత్రి కొప్పులఈశ్వర్‌కు ఆహ్వానం

మాజీ మంత్రి ఈశ్వర్ దంపతులకు ఆహ్వానం పత్రికను అందిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ అశోక్‌రావు

ధర్మారం, ఫిబ్రవరి12: దొంగతుర్తిలోని లక్ష్మీ గోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 15 నుంచి నిర్వహించనున్న విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలకు హాజరు కావాలని మాజీ మంత్రి ఈశ్వర్‌ను ఆలయ కమిటీ చైర్మన్ సముద్రాల ఆశోక్‌రావు, సభ్యులు ఆహ్వానించారు. సోమవారం కరీంనగర్‌లోని ఆయన ఇంటికి వెళ్లి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఇక్కడ ఎంపీటీసీ దాడి సదయ్య యాదవ్, మాజీ ఉప సర్పంచ్ ముత్యాల చంద్ర శేఖర్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు బాలసాని లింగయ్య, నాయకులు బండి సురేశ్, సంకరి చిన్న ఓదెలు, ఆలయ కమిటీ కోశాధికారి అలువాల తిరుపతి ఉన్నారు.

మహిళలు స్వయం ఉపాధి పొందాలి

శిక్షణ సామగ్రి అందజేస్తున్న జీఎం

సింగరేణి ఏపీఏ జీఎం కే వెంకటేశ్వర్లు

రామగిరి, ఫిబ్రవరి 12: మహిళలు స్వయం ఉపాధి మార్గాలు పెంచుకోవాలని సింగరేణి ఏపీఏ జీఎం కే వెంకటేశ్వర్లు సూచించారు. కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యానవన విశ్వ విద్యాలయం, రామగిరి ఖిల్లా కేవీకే, సింగరేణి ఏపీఏ సంయుక్త సహకారంతో మహిళలకు మగ్గం డిజైనింగ్, అద్దం డిజైనింగ్‌పై స్థానిక సింగరేణి ట్రైనింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులను సోమవారం ప్రారంభించారు. మగ్గం డిజైనింగ్‌కి డిమాండ్ పెరుగుతున్నదని, ఈ శిక్షణ మహిళలకు మంచి అవకాశమని చెప్పారు. మహిళలకు శిక్షణ ఇప్పించడంతో పాటు వారు రూపొందించిన వస్తువులను మార్కెటింగ్ చేసే విధంగా సదుపాయం కల్పిస్తామన్నారు. కేవీకే సహకారంతో రైతు శిక్షణ కార్యక్రమాలు, అడ్రియాల గని ముంపు గ్రామ బాధితులకు స్వయం ఉపాధి పెంపొందించేలా చేపడుతామన్నారు. కేవీకే కార్యక్రమాలను కేవీకే కో-ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్ వివరించారు. ముంపు గ్రామాలైన నాగారం, పన్నూరు, రత్నాపూర్, జూలపల్లి, రచ్చపల్లి, లద్నాపూర్, అక్కేపల్లి, నాగెపల్లి, కన్నాల్లో మహిళలు ఈ శిక్షణతో లబ్ధిపొందేలా అవకాశం కల్పిస్తున్నామన్నారు. చిరు ధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, సేంద్రియ వ్యవసాయంలో పండ్లు, కూరగాయలు పండించడం, మిర్చి, పసుపు తయారీ యూనిట్లు ప్రారంభించి స్వయం ఉపాధి పొందేలా తీర్చిదిద్దుతామన్నారు. ఇక్కడ ఆర్జీ-3 జీఎం రాధాకృష్ణ, ఎస్ఓటు జీఎం బైద్య, ఏఐటీయూసీ సెక్రెటరీ రవీందర్, ఐఎన్టీయూసీ ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, ఏజీఎం రవీందర్ రెడ్డి, కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ వెంకన్న ఉన్నారు.

రూ. 40.33 కోట్ల ఉపాధి పనులు మంజూరు

పెద్దపల్లి, ఫిబ్రవరి12: జిల్లాకు ఉపాధి హామీ కింద 431 సీసీ రోడ్ల నిర్మాణ పనులకు రూ. 40.33 కోట్లు మంజూరయ్యాయని పీఆర్ ఈఈ గిరిశ్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంథని మండలంలో 88 సీసీరోడ్లకు రూ. 8 .17కోట్లు, కమాన్‌పూర్‌లో 30 సీసీ రోడ్లకు రూ. 2.1 కోట్లు, రామగిరిలో 51 సీసీ రోడ్లకు రూ. 4. 98 కోట్లు, మంథని ముత్తారంలో 65 రోడ్లకు రూ. 6.55 కోట్లు, అంతర్గాంలో 12 సీసీ రోడ్లకు రూ. 2 .63 కోట్లు, పాలకుర్తిలో 24 రోడ్లకు రూ. 3.79 కోట్లు, ధర్మారంలో 24 సీసీ రోడ్లకు రూ. 2. 60 కోట్లు, పెద్దపల్లిలో 31సీసీ రోడ్లకు రూ. 2 .25కోట్లు, జూలపల్లిలో 16 సీసీరోడ్లకు రూ. 95 లక్షలు, సుల్తానాబాద్‌లో 29 సీసీ రోడ్లకు రూ. 1. 85 కోట్లు, ఓదెలలో 21 సీసీరోడ్లకు రూ. 1.85 కోట్లు, కాల్వ శ్రీరాంపూర్ లో 24 సీసీ రోడ్లకు రూ. 1.50 కోట్లు , ఎలిగేడు మండలంలో 16 సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 1.20 కోట్లు కేటాయించామని వివరించారు.

అంధులకు సచ్‌దేవ స్కూల్ రూ. 1.53 లక్షలు విరాళం

జ్యోతినగర్, ఫిబ్రవరి 12: ఎన్టీపీసీలోని సచ్‌దేవ స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు సొసైటీ ఫర్ నార్మెటివ్ ఎడ్యుకేషన్ త్రూ పల్సామన్ అసోసియేషన్(విజయవాడ)కు రూ. 1,53,652 విలువైన చెక్కును అందజేశారు. ఈ మేరకు సోమవారం పాఠశాలలో స్నేహ సంస్థ ఆధ్వర్యంలో సొసైటీ ఫర్ నార్మెంట్ ఎడ్యుకేషన్ త్రూ పల్సామన్ అసోసియేషన్ అంధుల సహాయార్థం నిర్వహించిన పాటల కార్యక్రమంలో తమ వంతుగా పెద్ద మొత్తంలో విరాళం అందజేశారు. ఇక్కడ పాఠశాల ప్రిన్సిపాల్ జ్ఞాన్‌చంద్, హెచ్ఎం ఆరం జ్యోతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

కాంట్రాక్ట్ కార్మికురాలికి జాతీయ క్రీడారత్న అవార్డు

అవార్డు తీసుకుంటున్న శాంతమ్మ

జ్యోతినగర్, ఫిబ్రవరి 12: ఎన్టీపీసీ కాంట్రాక్ట్ కార్మికురాలు జాగంటి శాంతమ్మకు బహుజన సాహిత్య అకాడమీ జాతీయ క్రీడారత్న అవార్డు అందజేసింది. ఆదివారం ఏపీలోని తిరుపతిలో జరిగిన బహుజన రైటర్స్ సౌత్ ఇండియా కాన్ఫరెన్స్‌లో శాంతమ్మకు పురస్కారం ప్రదానం చేశారు. అథ్లెటిక్స్‌లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పలు మెడల్స్ సాధించినందుకు గాను శాంతమ్మకు పురస్కారం అందజేశారు. ఇక్కడ బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధకృష్ణ, సౌత్ ఇండియా ప్రధాన కార్యదర్శితో పాటు జిల్లా అధ్యక్షుడు పానుగంటి రాజలింగం ఉన్నారు.

15 మంది ఎస్ఐల బదిలీ

ఫర్టిలైజర్‌సిటీ, ఫిబ్రవరి12: రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలో పనిచే స్తున్న 15 మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ ఐ జీ తరుణ్ జోషి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. రామగిరి ఎస్ఐ కే రవిప్రసాద్, సుల్తానాబాద్ ఎస్ఐ బద్దం వినీత, అంతర్గాం ఎస్ఐ బీ సంతోష్ వీఆర్ రామగుండంకు బదిలీ అయ్యారు. వీఆర్ రామగుండంలో ఉన్న టీ కళధర్‌రెడ్డిని సీసీఆర్‌బీ మంచిర్యాల ఎస్ఐ 1, ఎండీ సిరాజ్‌అహ్మద్ ను సీసీఎస్ పెద్దపల్లి ఎస్ఐ 2గా, టీ విక్టర్‌ను సీసీఆర్‌బీ రామగుండం ఎస్ఐ-1గా వీ మధుసూదన్‌గా పీసీఆర్ మంచిర్యాల ఎస్ఐ 3గా, టీ గంగారాజ్‌గౌడ్ సీసీఎస్ మంచి ర్యాల ఎస్ఐ-3గా, సీసీసీ నస్పూర్ ఠాణా రెండో ఎస్ఐ మేకల సంతోష్ శ్రీరాంపూర్ ఠాణాకు బదిలీ అయ్యారు. శ్రీరాంపూర్ ఎస్ఐ కే రాజేశ్ వీఆర్ రామగుండంకు, మంచిర్యాల టౌన్ అటాచ్డ్ ఎస్ఐ కే మహేందర్‌ను మంచిర్యాల టౌన్ ఎస్ఐ 2గా, కన్నెపల్లి ఎస్ఐ కే నరేశ్ దండేపల్లికి, దండేపల్లి ఎస్ఐ కే ప్రసాద్‌ను మంచిర్యాల టౌన్ ఎస్ఐ -3గా, వీఆర్ రామగుండం ఎస్ఐ జీ సురేశ్‌ను హాజీపూర్‌కు, హాజీపూర్ ఎస్ఐ జే నరేశ్ కుమార్‌ను వీఆర్ రామగుండంకు బదిలీ చేశారు.

కరాటే పోటీల్లో ప్రతిభ

మంథని/జ్యోతినగర్ ఫిబ్రవరి 12 : వరంగల్ జిల్లా నర్సంపేటలో నిర్వహించిన జాతీయ కరాటే పోటీల్లో మంథనికి చెందిన షోటోకాన్ కరాటే అకాడమీ క్రీడాకారులు పతకాలు సాధించారు. అకాడమీ ఇన్స్ట్రక్టర్ కొండ్ర నాగరాజు ఆధ్వర్యంలో నలుగురు క్రీడాకారులు ప్రతిభ చూపి 4గోల్డ్ మెడల్స్, సిల్వర్ మెడల్ సాధించారు. బీర ఆదిత్యతే జ,ఒర్సు సుశ్రుత్, ఆత్మకూరి అన్వు, నివాస్ పతకాలు సాధించారు. విజేతల నుజేకేఏ షాటోఖాన్ కరాటే అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఇన్స్ట్రక్టర్ నూకల బానయ్య అభినందించారు. మగుండంకు చెందిన జపాన్ షిటోరియా కరాటే అకాడమీ క్రీడాకారులు ప్రతిభ చూపి పతకాలు సాధించారు. బ్లాక్ బెల్ట్ విభాగంలో ఎం ముక్తిశ్రీ వెండి, కలర్ బెల్ట్ కటాస్ విభాగంలో ఎం కార్తికేయన్, ఎం మనస్విని, వీ బోర్, టీ పవన్‌కుమార్ బంగారు పతకాలు సాధించారు. సీహెచ్ అశ్విన్, ధ్రువన్ కాం స్యం, విఘ్నేశ్ వెండి పతకం సాధించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రథమ స్థానం

విద్యార్థిని అభినందిస్తున్న హెచ్ఎం

ధర్మారం,ఫిబ్రవరి12: నర్సింహులపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని వేల్పుల శ్రీలత సైన్స్ ఆధారిత కథల పోటీలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర స్థాయిలో హైదరాబాద్‌లోని దవే సైన్స్ ఫిక్షన్ కథల పోటీలు నిర్వహించారు. శ్రీలతతో పాటు మరో విద్యార్థి బొట్ల లక్ష్మీ గణేశ్ కథలు రాసి పంపించారు. ఈ నెల 11న హైదరాబాద్‌లోని బుక్ ఫెయిర్‌లో చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ, బాల చెలిమి గ్రంథాలయ అధ్యక్షుడు మణికొండ వేదకుమార్ విజేతలను ప్రకటించారు. శ్రీలత రాసిన ఆలోచన కథకు రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి లభించింది. ఈనెల 28న ఈ విద్యార్థినికి రూ.2వేల నగదుతోపాటు, జ్ఞాపిక, ప్రశంస పత్రం అందించి సన్మానం చేయనున్నట్లు నిర్వాహకులు డాక్టర్ వీఆర్ శర్మ, గరిపెల్లి అశోక్, డీ పద్మావతి సమాచారాన్ని పాఠశాలకు పంపించారు. బొట్ల లక్ష్మి గణేశ్ రాసిన 'అన్నయ్య మరణం' కథకు ప్రత్యేక బహుమతి లభించింది. ప్రతిభ చూపిన విద్యార్థులతో పాటు ప్రోత్సహించిన తెలుగు ఉపాధ్యాయుడు కందుకూరి భాస్కర్‌ను హెచ్ఎం నాగుల రవీందర్, ఉపాధ్యాయులు సన్మానించి అభినందించారు.

రూ.10 వేలు కొట్టేసిన సైబర్ మోసగాళ్లు

ధర్మారం,ఫిబ్రవరి12: సైబర్ నేరగాళ్లు ఓ వ్యక్తి బ్యాంక్ ఖాతా నుంచి రూ.10 వేలు కొట్టేశారు.దీంతో బాధితుడు ఈ మేరకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ టీ సత్యనారాయణ, బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నంది మేడారంలోని సందినేని పవన్ యాదవ్‌కు చెందిన ఎస్‌బీఐ ఖాతా నుంచి రూ.10 వేలు డ్రా అయినట్లు ఆదివారం సాయంత్రం అతని సెల్‌ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. దీంతో సదరు వ్యక్తి ఈ సమాచారాన్ని చూసి ఆందోళనకు గురయ్యాడు. బ్యాంక్‌కు వెళ్లి ఆరాతీయగా ఫింగర్ ప్రింట్ ఆధారంగా ఆధార్ ఎనేబుల్ పేమెంట్ సిస్టం (ఏఈపీఎస్)ద్వారా ఆధార్ నంబర్‌తో సైబర్ నేరగాళ్లు డబ్బులు డ్రా చేసినట్లు నిర్ధారణ అయింది. దీంతో జరిగిన మోసంపై సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశాడు. తాను ఈ నెల 9న స్థానిక రెవెన్యూ కార్యాలయంలో భూమి రిజిస్ట్రేషన్ సందర్భంగా వేలి ముద్రలు వేశానని, ఆ తదుపరి డబ్బులు డ్రా అయినట్లు బాధితుడు పవన్ యాదవ్ ఫిర్యాదు చేశాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉద్యోగాల కల్పనకు ఎస్ఏపీతో ఒప్పందం

రామగిరి, ఫిబ్రవరి 12: మంథని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు ఉద్యోగాల కల్పనకు శిక్షణ ఇచ్చేందుకు గాను తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ సెంటర్ సహకారంతో ఎస్ఏపీ ఎడ్యునెట్‌తో సోమవారం ఒప్పందం జరిగింది. టాస్క్ సీఈఓ శ్రీకాంత్ సమక్షంలో జేఎన్‌టీయూ కళాశాల ప్రిన్సిపాల్ చెరకు శ్రీధర్‌రెడ్డి, ఎస్ఏపీ డైరెక్టర్ ఆశిష్ అరోరా ఎంఓయూపై సంతకాలు చేసి ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందం 2027 మార్చి 31 వరకు ఉంటుంది. తెలంగాణ వ్యాప్తంగా 15 కేంద్రాలను టాస్క్ ఎంపిక చేయగా ఇందులో స్థానిక కళాశాల ఒకటి. శ్రీకాంత్ సింహ, ఎస్ఏపీ విభాగ అధిపతి సాగరిక బోస్ మాట్లాడారు. మంథని జేఎన్‌టీయూ కళాశాలతో ఒప్పందం చేసుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. ఏలాంటి ఫీజు లేకుండా ఉచితంగా శిక్షణ పొందవచ్చన్నారు. శిక్షణ కోసం ప్రత్యేకంగా ల్యాబ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు.